# అంతరంగ తరంగం

## (సీతాయనం)



డా॥ ఆర్. అనంతపద్మనాభరావు

# అంతరంగ తరంగం

## (సీతాయనం)

### వచన కావ్యం

**డా॥ ఆర్. అనంతపద్మనాభరావు**

దూరదర్శన్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ (రిటైర్డు)

హైదరాబాద్.

98665 86805

# అంతరంగ తరంగం

ప్రథమ ముద్రణ : 2014

హక్కులు : © రచయితవి

ప్రతులు : 1000

పుటలు : 210

ప్రతులకు :

**డా॥ ఆర్. అనంతపద్మనాభరావు**

బి 408, సాయికృపా రెసిడెన్సీ,

మోతీనగర్, హైదరాబాద్ - 500 018.

సెల్ : 98665 86805, 040-23831112

E-mail: padmanabharao.revuru@gmail.com

ప్రతులకు :

- విశాలాంధ్ర ప్రచురణాలయం అన్ని శాఖలు
- నవోదయ బుక్ హవుస్
  ఆర్య సమాజ్ ఎదురుగా, హైదరాబాద్.
- ఇతర పుస్తక విక్రయ ముఖ్య కేంద్రాలలో

డి.టి.పి.

**టి. రాజేంద్రప్రసాద్**

సెల్ : 9989890588

ముద్రణ :

**అక్షయ గ్రాఫిక్స్**

టి.ఆర్.టి. 362, విద్యానగర్ కాలనీ, హైదరాబాద్.

# ఇందులో


| | | |
|---|---|---|
| 1. | కౌసల్యాసుప్రజారామా... | 5 |
| 2. | రామబాణం | 14 |
| 3. | ఇంద్రుని వంచన | 18 |
| 4. | వరాలతల్లి | 24 |
| 5. | గచ్ఛతాత యధాసుఖం | 31 |
| 6. | అంధకారబంధురమైన అయోధ్య | 35 |
| 7. | పత్నీపరిచయం | 55 |
| 8. | ఇయంసీతా మమసుత | 67 |
| 9. | వనవాస సుఖం | 82 |
| 10. | చుప్పనాతి చెల్లెలు | 109 |
| 11. | మాయలేడి | 121 |
| 12. | జనకపత్ని | 132 |
| 13. | మగత నిద్రలో | 136 |
| 14. | ఎంగిలిచేసిన పండ్లు | 141 |
| 15. | మాటనేర్పరి | 145 |
| 16. | హనుమచాతుర్యం | 161 |
| 17. | పరాక్రమశాలి హనుమ | 163 |
| 18. | సీతజాడ | 164 |
| 19. | విధివంచిత | 166 |
| 20. | అశోకవనంలో.. | 171 |
| 21. | లంకాధిపతి కోడలు | 182 |
| 22. | పట్టాభిషిక్తుడైన రాముడు | 190 |
| | **గురుపూజామహోత్సవం** | 199 |

# నా అంతరంగం

వాల్మీకి రామాయణం జగత్ప్రసిద్ధం.

వేలాది సంవత్సరాలుగా సంస్కృతంలోను, తెలుగులోను, ఇతర భాషల్లోను రామకథను చెప్పారు..చెబుతున్నారు.... చెబుతారు...

రామాయణాన్ని రామచరితమానస్‌గా తులసీదాసు ప్రవచించాడు.

విశ్వనాధవారి రామాయణం జ్ఞానపీఠమైంది.

"మరలనిదేల రామాయణ"మ్మని విశ్వనాధవారే చెప్పుకొన్నారు.

రామాయణంపై వందలకొద్ది పరిశోధనలు వెలువడ్డాయి.

ఇది సరికొత్త ప్రయోగం.

రామాయణంలో 18 మంది స్త్రీలు తమ అంతరంగాన్ని ఎలా ఆవిష్కృతం చేశారో కల్పన చేశాను. ఇది పరిశోధనాత్మక కల్పన. కేవలం స్త్రీలద్వారా కథ నడిచింది. 18 సంఖ్యకు మన హిందూసంప్రదాయంలో ప్రాధాన్యం వుంది.

ఇది కవిహృదయంలోని వేదన.. నివేదన..

స్త్రీ పాత్రలు మనసువిప్పి చెప్పుకోలేని గుండెల ఆక్రందన.

తరతరాలుగా వారిలో గూడుకట్టుకొన్న మానసిక వేదన.

ఒకరిపై ఒకరికి ఆదరం, గౌరవం, అభిమానం.

విధి చేతిలో కీలుబొమ్మలు, విలువలు తెలిసిన మహిళలు.

సముద్రతరంగాలు చెలియలికట్ట దాటనట్లే రామాయణ స్త్రీల అంతరంగతరంగాలు మర్యాదాతిక్రమణం చేయవు.

ఇవి సీతాయన కథాగమన శిల్పాలు.

ఆ శిల్పాల సౌందర్యం చూసి ఆనందిద్దాం.

అంతరంగ తరంగాల ఆకృతిని ఈ కృతిలో దర్శిద్దాం.

ఈ గ్రంథ ప్రచురణకు దోహదం చేసిన ఆంధ్రా బ్యాంకు జనరల్ మేనేజరు శ్రీ టి.వి. చంద్రశేఖర్‌గారికి కృతజ్ఞతలు.

**డా॥ ఆర్. అనంతపద్మనాభరావు**
9866586805

హైదరాబాద్
6-6-14

# కౌసల్యాసుప్రజారామా...
# (కౌసల్య)

కౌసల్యా సుప్రజారామా! పూర్వాసంధ్యా ప్రవర్తతే
ఉత్తిష్ఠ నరశార్దూల! కర్తవ్యం దైవమాహ్నికం (వాల్మీకి)

పుణ్యశ్లోకుడు విశ్వామిత్ర మహర్షి నా ముద్దు బిడ్డ శ్రీరాముణ్ణి మేల్కొల్పడానికి ఏ సంధ్యాకాలన అన్నాడో గానీ, కడుపు పంట నిజంగా నరశార్దూలమే.

అతడు నా సుప్రజ. నా జీవితంలో నేను ఏం సుఖాలనుభవించాను గనుక. పేరుకు పట్టమహిషిని. దశరథ మహారాజు గారి పెద్ద భార్యను. కౌసల్యాతనయుడు శ్రీరామచంద్రుడని అందరూ నన్ను పొగిడారు. నా కడుపుకోత ఎవరికి తెలుసు?

రాముడరణ్యాలకు వెళ్లడానికి వెనుక ఆ కైక చేసిన కుట్రకు మహారాజు బలిఅయ్యాడు. దశరథమహారాజుల వారి పరిచయమే ఒక అద్భుతం!

మా తండ్రి భానుమంతుడు కోసల దేశపు రాజు. ఆయన సామ్రాజ్యం సిరిసంపదలకు పెట్టింది పేరు. నేను యౌవనవతినై విద్యలన్నీ నేర్చుకొని గారాబుగా పెరిగాను. ఒకానొక రోజు చెలికత్తెలతో కలిసి ఉద్యానవనంలో విహరిస్తున్నాను. ఒక పొదరింటి మాటున నా చెలులతో దాగుడుమూతలాడుతున్నాను.

పొదరింటి నుండి బయటకు వచ్చి చూస్తే – ఆజానుబాహుడైన ఓ రాజ పురుషుడు కంటబడ్డాడు. అద్భుతమైన విగ్రహం. రాజలాంఛనాలు, కిరీటం, నెన్నుదురు, ఆ చిలిపి కళ్లు, నిగారింపు చెక్కిళ్లు, దేవలోకంలోంచి వచ్చిన గంధర్వుడనిపించింది.

"రాకుమారీ! మీరు!" రాజకుమారుడు చిలిపిగా ప్రశ్నించాడు.

'ఏకాంతంలో వున్న జవరాంద్రను నెపంబిడి పల్కరించడం భావ్యమా!' చెలికత్తెలన్నారు.

వారించాను నేను.

'మేం దశరథ మహారాజులం' స్వపరిచయం చేసుకొన్నారు వారు. మౌనంగా సిగ్గు దొంతరలతో తలవాల్చి నిల్చుని, కాలి కొనగోర భూమిపై గీతలు గీస్తున్నాను.

వారు సమీపంగా వచ్చారు. అవ్యక్తమధురమైన సుమపరిమళం వీచింది. మందపవనాలు మా ఇరువురినీ కమ్మివేశాయి. తుమ్మెదలను తరిమివేసే నెపంతో చెలికత్తెలు దూరంగా వెళ్తూ .. 'కౌసల్యా రాకుమారి గారూ! పొదరింటిలోకి వెంటనే వెళ్లండి.. తుమ్మెదలు!' అన్నారు.

'కౌసల్య! ఎంత చక్కని పేరు'.. 'కోసలదేశ మహారాజు గారికి మా కుశల ప్రశ్నలు

అందించండి' అంటూ చిరునవ్వులు చిందిస్తూ వెళ్లిపోయారు.

'దశ-రథ మహారాజు' - దశరథులు - పది రథాలు' కొత్తగా వుంది నామధేయం. మాటిమాటికీ ఆ పేరు ఉచ్ఛరిస్తూ చెలికత్తెల వైపు పరుగులు తీశాను.

'ఏమమ్మా! కొంటెచూపులతో ఆ రాజు కొసరి చూస్తుంటే మందలించలేదేం?'

చెలి సుభాషిణి నర్మోక్తులాడింది.

చెలిని కసురుకుంటూ అంత:పురంలోకి నడిచాను.

శయనగృహంలో హంసతూలికాతల్పంపై నడుం వాల్చాను.

నా పూర్వజన్మ గుర్తుకు రాసాగింది.

కశ్యపుని భార్య అదితిగా ఎన్నో గౌరవాలు పొందాను. కోసల దేశరాజ కుమార్తెగా జన్మించడం ఓ పురాకృత సుకృతం.

శయనగృహంలో ఓ మూల వున్న దేవీమాత విగ్రహం కన్పించింది. 'దశ-రథులు' మేనిపై పులకలు గిలిగింతలు పెట్టాయి.

దేవీ మాతకు మనసులోనే నమస్కరించాను. రోజులు భారంగా గడిచాయి.

యధావిధిగా ఆ సాయంకాలం చెలికత్తెలతో వెళ్లాను ఉద్యానవనానికి.

లతానికుంజాల మధ్య కేరింతలు కుడుతూ ఆడుకొన్నాం. పాటలు పాడుకొన్నాం.

మాధవీలతలపై ఓ చిలుక సుతారంగా నిలుచుంది.

నేను చిలుకకు సమీపంగా వెళ్లాను. చిలుక పలుకులు మొదలెట్టింది.

'రాకుమారీ! ఇదిగో సందేశం! ఇదిగో ప్రేమకానుక!'

అస్పష్టంగా వినిపిస్తున్న ఆ పలుకులు ఆశ్చర్యం కలిగించాయి.

చెలులు దూరంగా వున్నారు.

'శుక సందేశం' అనుకుంటూ చిలుక కాలికి కట్టిన లేఖ అందుకొన్నాను. చిలుకముక్కున రత్నాంగులీయకం.

ఆశ్చర్యంగా ఆ చిలుక ఆ ఉంగరాన్ని నా చేతిలో పెట్టింది. లేఖ విప్పి చదవనారంభించాను.

**"ప్రియే! చారుశీలే! కౌసల్యే!**

**ఈ రత్నాంగులీయకం మా ప్రణయ చిహ్నం**

**స్వీకరించండి.**

**ఇతి**

**శ్రీశ్రీశ్రీ దశరథ మహారాజులవారు**

ఆశ్చర్యం! నిజామా? కలా? నమ్మలేకపోయాను. ఉంగరాన్ని కళ్లకద్దుకుని నా వామహస్తంలో ఉంగరపు వేలికి ధరించాను. చెలులు సమీపించారు. మంద్రమంద్రంగా ముందుకు సాగాను. ఆనందంతో శుకం రివ్వున ఆకాశాని కెగసింది. 'దశరథులు– పంక్తిరథులు' అవే మాటలు పలుకుతున్నాను. అదే పులకరింత శరీరానికి.

అంత:పుర పరిచారికలు రాకుమారి ఆవేదనను, ఆవేశాన్ని గమనించి ఆశ్చర్యపోతున్నారు. తనలో తానే ఏదో మాట్లాడుకొంటుంది.

ఒకటి, రెండు, మూడు, నాలుగు – పది' అంటూ చేతివేళ్లు లెక్కపెడుతుంది. వేగంగా రథంపై వెళ్తున్నట్లు ఊహించుకొంటుంది.

సున్నితంగా 'దశరథులు' అనేమాట ఒక్కొక్కసారి పైకి వినిపిస్తుంది.

అంత:పురంలో రాకుమారి బాధను కర్ణాకర్ణిగా మహారాజు భానుమంతుని చెవిని వేసింది పట్టమహిషి. రాకుమారి దశరథులవారిపై మమతానురాగాలు పెంచుకొందని వారు గ్రహించారు. అల్లారుముద్దుగా పెరిగిన బిడ్డకు మనసుకోరిన వాడితోనే వివాహం చేద్దామని సంకల్పించారు.

భానుమంతుడు ఒకానొకనాడు కొలువుకూటంలో సభ చేశారు.

మంత్రి పరిషత్తు ముందు తన కుమార్తె వివాహ శుభవార్తను ప్రకటించారు.

కులగురువులతో జాతకాలు సరిచూశారు.

శ్రావణ శుద్ధ సప్తమి శనివారం అభిజిత్ లగ్నంలో కళ్యాణముహూర్తం నిర్ణయించారు. దూరంగా ఉరుములతో కూడిన మెరుపు. మహారాజు నిర్విణ్ణులయ్యారు.

మహారాజు : ఆచార్యదేవా! ఏమిటీ వైపరీత్యం?

ఆచార్యులు : ప్రభూ! రాకుమారి జాతకంలో సప్తమస్థానం...

ప్రభువు : సప్తమం...

ఆచార్యులు : బలహీనం ప్రభూ!

ప్రభువు : ప్రస్తుత కర్తవ్యం. రాకుమారికి గత మాసంలో కుజదోష నివారణ పూజలు చేయించాం. శాంతులు కూడా చేయించాం.

ఆచార్యులు : ప్రభూ! ముహూర్త బలం అపరిమితంగా వుంది. ఆటంకాలెదురయినా వీరిరువురికి వివాహం నిశ్చయంగా జరుగుతుంది. తమరు వివాహ ప్రయత్నాలు ఆరంభించవచ్చు.

**కుండపోతగా వర్షం**

ప్రభువు : అమాత్యవర్యా! అజమహారాజునకు వివాహ వర్తమానం రాజలాంఛనములతో అందించండి. వారు తమ పుత్రులు దశరథ

మహారాజుతో కలిసి సపరివారంగా వివాహానికి కోసలకు రావలసిందిగా ఆహ్వాన లేఖలు పంపండి.

ఆమాత్యులు: చిత్తం ప్రభూ!

దశరథుడు సపరివార సమేతంగా కోసల నగరానికి బయలుదేరాడు. అశ్వరథ బలాలతో దివ్యదుందుభుల నాదంతో వరుడు ముందుకు సాగాడు. విపరీతమైన వర్షం. కుండపోతగా పడుతున్న వర్షధారలను లెక్కచేయకుండా ముందుకు సాగుతోంది పరివారం. మరికొంత దూరంలో ఉధృతమైన నదీప్రవాహం. పరివారమంతా నదికి సమీపంలో నిలిచిపోయింది. అశ్వారూఢుడైన దశరథుడు నది దాటుతున్నాడు. నదీప్రవాహం ఉధృతమైంది. అశ్వం పట్టుతప్పింది. గుర్రాన్ని అధిరోహించిన దశరథుడు ప్రాణాలతో పోరాడుతూ ఈదులాడుతున్నాడు. దశరథుడు ఒక మందసం ఆధారంగా సముద్రతీరానికి చేరాడు భగవత్కృపతో.

తన తండ్రి ద్వారా విన్న ఆ గాధ కౌసల్యకు యింకా గుర్తు. విధి విచిత్రమైనది. ఇందులో నారదుని పాత్ర కూడా లేకపోలేదు. ఒకానొకనాడు నారదమహర్షి లంకాధీశుని నగరానికి వెళ్లాడు. కొలువుతీరిన దశకంతుడు నారదునికి అతిథిసత్కారాలు చేసి ఉచితాసనంపై కూర్చోబెట్టాడు.

రావణుడు: మహర్షీ! భూత భవితష్యత్ వర్తమానాలను దివ్యదృష్టితో చూడగలిగిన తాము మా భవిష్యత్తును దిఙ్మాత్రంగా సెలవివ్వండి.

నారదుడు: విధి బలీయం. ఆగామి సంచితాలను ఎవ్వరూ తప్పించుకోలేరు. నాయనా! నీవు అష్టదిక్పాలకులను జయించి నీ అడుగులకు మడుగులొత్తేలా చేశావు. కానీ...

రావణుడు: ఏమిటి మహర్షీ... ఆగిపోయారు?

నారదుడు: తగవులమారియని నన్ను అందరంటారు. కానీ నిజం చెప్పక తప్పదు.

రావణుడు: ఏమిటానిజం?

నారదుడు : కోసలదేశాధీశుని కుమార్తె కౌసల్యకు వివాహం జరుగబోతోంది. ఆమెగర్భంలో జన్మించే కుమారుడు నీ మరణానికి హేతువు కాబోతాడు.

రావణుడు : అసంభవం... (అభ్యంతర మందిరం దద్దరిల్లింది) ఈనాడే ఆ కౌసల్యను సముద్రమధ్యంలో పడవేస్తాను. వివాహము లేదు, గర్భమూ లేదు. ఈ దశకంతుని ప్రతాపాగ్నికి దేవతలే భస్మీభూతమయ్యారు.

రావణుడు కౌసల్యను స్వయంగా ఎత్తుకొని వచ్చి సముద్రం మధ్యలో ఒక మందసంలో పెట్టాడు. అదే మందసం దశరథునికి ఆధాంమైంది. ఇద్దరూ సముద్రతీరానికి చేరారు. అక్కడే దశరథుల వారు కౌసల్య పాణిగ్రహణము తమ వంశ మూలపురుషుడైన సూర్యుని సాక్షిగా చేశారు.

శయ్యపై పరుండిన కౌసల్య మనస్సులో ఈ ఆలోచనా ప్రవాహం దొర్లిపోతోంది.

మందసం సముద్రతీరానికి చేరడం, కౌసల్యా దశరథుల వివాహం గురించిన వార్త తెలిసింది రావణునికి. ఆగ్రహెదగ్రుడయ్యాడు. కౌసల్యను చంపటానికి ఉద్యుక్తుడై బయల్దేరాడు.

నారాయణ! నారాయణ! అంటూ నారదుడు మళ్లీ ప్రత్యక్షమయ్యాడు.

రావణుడు : మహర్షీ! ఆ కౌసల్యను అంతమొందించనిదే నాకు నిద్రపట్టదు.

నారదుడు : నాయనా! నీవంతదూరం వెళ్లి స్త్రీ హత్య దోషానికి పాల్పడనవరసం లేదు.

రావణుడు : మహర్షీ.. నన్నాపకండి!

నారదుడు : కౌసల్యకు పుత్ర సంతానం కలిగితేనే గదా! ఆమెకు ఇప్పట్లో ఆ భాగ్యంలేదు. సమస్తదేవతలను జయించిన నీవు ఒక స్త్రీని చంపటం వీరోచితమనిపించుకోదు. ముల్లోకాలను గడగడలాడించి పరమశివుని మెప్పించిన నీకు ఒక సామాన్య మానవుణ్ణి అదీ ఆ పుట్టబోయే బిడ్డను జయించడం లెక్కలోనిది కాదు. నా మాట విని ప్రయత్నం విరమించుకో!

శకునం బాగులేదని రావణుడు వెనుదిరిగాడు.

సముద్రతీరంలో నిస్సహాయంగా సంచరిస్తున్నారు నూతనదంపతులు. కౌసల్యాదశరథులు. దేవీమాతను ధ్యానించింది కౌసల్య.

సుదూర తీరాల నుండి ఏదో ఒక పెద్ద గృధ్రరాజం రివ్వురివ్వున వెళుతూ మార్గ మధ్యంలో విశ్రాంతికా అన్నట్లు వారి సమీపంలో వాలింది. చేతులెత్తి నమస్కరించింది కౌసల్య.

దశరథుడు : గృధ్రరాజా నేను అయోధ్య రాకుమారుణ్ణి. మా తండ్రి అజమహారాజు. కాలవైపరీత్యంవల్ల మా వివాహానికి భంగమై ఇప్పుడే మేమిద్దరం ఒకటయ్యాము.

జటాయువు : మానవ భాషను అర్థం చేసుకోగల ఆ పక్షి రాజు జటాయువు నూతన వధూవరులను సునాయాసంగా ఆకాశమార్గంలో అయోధ్యకు చేర్చాడు. ఆ పక్షిరాజుకు నూతన దంపతులు నమస్కరించారు. నీ రుణం తీర్చుకోలేమన్నారు. ఈ సాహచర్యం జీవితాంతం వుంటుందన్నాడు దశరథుడు.

అయోధ్యా నగరాధీశుడైన దశరథ మహారాజు క్రమంగా సంసారబంధంలో పడ్డాడు. ఆ పైన సుమిత్రను వివాహమాడాడు. కొన్నాళ్లకు ముద్దుల భార్యగా కైకేయి రాణివాసంలో చేరింది. ముగ్గురు రాణులు రాజుగారి ముద్దు ముచ్చట్లు తీరుస్తున్నారు.

దశరథుడు రాజ్యపాలనాభారంతో వున్నా ఆయన మనస్సులో ఏదో తీరని ఆవేదన. పుత్రసంతానం లేదన్న దుర్భర వేదన.

ఆలోచిస్తున్న కౌసల్యకు నిద్రపట్టలేదు.

దైవికంగా జరిగే సంఘటనలు తన జీవితంలో అనేకం జరిగాయి. విధికి తలవొగ్గి ఏకాంతంగా బాధలననుభవించే మౌనవ్యక్తికి చిహ్నంగా తాను నిలిచిపోయింది. తాను మహారాజుకు పెద్ద భార్య అయినా ఇతరులపై తన పెత్తనం చూపించి కాని, భర్త నుంచి ప్రత్యేక ప్రేమను పంచుకున్నది గాని లేదు.

× × × ×

కౌసల్య మందిరంలో ఏకాంతంలో వున్న మహారాజు చింతాక్రాంతుడై విషణ్ణవదనంతో ఆలోచనా నిమగ్నుడై శయ్యాసనంపై కూర్చుని వున్నాడు. అప్పుడే శయనగృహంలోనికి ప్రవేశించిన తాను పతిదేవుని పాదాలకు నమస్కరించి 'ప్రభూ! తమరు రాచకార్యాలలో ఏదో తీరని కోర్కెను గూర్చి ఆలోచిస్తున్నట్లు వుంది. అభ్యంతరం లేకపోతే....”

మృదువుగా నా శిరస్సు నిమురుతూ ప్రభువు అన్నారు. “దేవీ! అపుత్రస్య గతిర్నాస్తి” అన్నారు పెద్దలు. నాకా వయోభారం హెచ్చింది. ఈనాటి సభామందిరంలో కులగురుడు వశిష్ఠుడు పుత్రకామేష్టి చేయమని సూచించారు. శుభముహూర్తం నిర్ణయించి ఆ క్రతువును పూర్తి చేయాలి. మనం ఆ క్రతుభారాన్ని నిర్వహించాలి. మా వంశపురుషుడైన సూర్యభగవానుని అనుగ్రహంతో యజ్ఞఫలం లభించగలదు.

వశిష్ఠులవారి ఆదేశానుసారం సత్యవాదియైన మిథిలాపతి జనకమహారాజునకు ఆహ్వానం పంపాము. వారిని స్వయంగా సత్కరించి, సన్మానించి తీసుకురమ్మని గురుదేవులు సుమంత్రుడికి చెప్పాం. గురువులు త్రికాలవేదులు. కేకయరాజుకు, కోసల రాజుకు, ఇతర దేశాధీశులకు ఆహ్వానాలు పంపుతున్నాము. అంగదేశం నుండి శాంతాఋష్యశృంగులను అయోధ్యకు రప్పిస్తున్నాము”.

తాను మహదానందంతో ప్రభువుల దక్షిణ హస్తాన్ని ముద్దాడింది. గాఢాలింగనంతో తనను ప్రభువు సన్మానించాడు.

సరయూనదీతీరంలో యజ్ఞవాటిలో జరిగిన క్రతుతంత్రం కౌసల్య కళ్లముందు మెదిలింది. ఋత్విక్కులు కర్మకాండ నిర్వహిస్తున్నారు. ప్రవర్గ్యం, ఉపసదం, ప్రాతర్మధ్యాహ్నం, సాయంసవనాదులు సక్రమంగా జరుగుతున్నాయి. పట్టమహిషిగా తాను మహారాజు సరసన కూర్చుని అగ్రతాంబూలం స్వీకరించి యజ్ఞం నిర్వహిస్తోంది. అటు పక్కగా సుమిత్ర, కైకేయి. కులగురువు వశిష్ఠుని ఆధ్వర్యంలో అంతా సవ్యంగా సాగుతోంది.

మృష్టాన్న భోజనంతో యజ్ఞసందర్శనానికి విచ్చేసిన దేశాధిపతులు, వారి పరివారము పవిత్రంగా జరుగుతున్న ఆ సవనాన్ని తిలకించి పులకించారు. వచ్చిన ప్రతి ఒక్కరూ 'తృప్తాస్మ' అని సంతోషంగా వెళుతున్నారు. వేదఘోషలు, శాస్త్రార్థచర్చలు కొనసాగుతూనే వున్నాయి.

యూపనిర్మితి చేయడం వాటిని అలంకారాలతో తీర్చిదిద్దటం అద్భుతంగా సాగింది. రాణులు ముగ్గురూ ఆ పశువులకు పరిచర్యలు చేస్తున్నారు. మహారాజు తమకు దక్షిణగా ఇచ్చిన ధనాన్ని బ్రాహ్మణులంతా ఋష్యశృంగ మహామునికి సమర్పించారు. ఆ సాయంసంధ్యావేళ నిర్ధనుడై వున్న దశరథ మహారాజు వద్దకు ఒక పేద బ్రాహ్మణుడు వచ్చాడు. సమస్తాన్ని కానుకలుగా సమర్పించాడు. నమస్కరిస్తుండగా తన వామ హస్తంలో అంగుళ్యాభరణం కనిపించింది. వెంటనే దానిని ఆ బ్రాహ్మణునికి దానం చేశాడు.

అది చూసిన ఋష్యశృంగుడు ఆనంద పరవశుడయ్యాడు. 'నీకు నలుగురు మహావీరులు కుమారులుగా జన్మిస్తారు' అని ఆశీర్వదించాడు. ఇప్పటికి అశ్వమేధయాగం మాత్రమే పూర్తయింది. ఇకపై పుత్ర కామేష్టి నిర్వహిద్దామని ఋష్యశృంగుడు మహారాజును ఆదేశించాడు. యజ్ఞం ఆరంభమయ్యింది. హవిస్సును ఆరగించటానికి దేవతలు విచ్చేశారు. మరి యజ్ఞకర్తకు ప్రతిఫలం ఏమివ్వాలి? దేవతలు బ్రహ్మను సమీపించారు. లోక కంటకుడైన రావణుని సంహారం కోసం దశరథునికి సంతానంగా తాను జన్మిస్తానని వారితో శ్రీ మహావిష్ణువు శలవిచ్చాడు.

తనను 'హ్రీ' అని బ్రహ్మదేవుడు ఏ క్షణాన వర్ణించాడో కానీ తన అణువణువునా ఆ లక్షణాలను తను జీర్ణించుకుంది. నాలుకపై వాగ్దేవి నర్తించే ఆ బ్రహ్మ వాక్కులు ఎన్నడూ వట్టివి కావు. బ్రహ్మదేవుడు మా ముగ్గురు రాణులను, హ్రీ, శ్రీ, కీర్తిగా వర్ణించడం తనకింకా గుర్తు. నమ్రతకు తాను మారుపేరు. పదాలతో వ్యక్తం చేయలేని సాంకేతికమైన ప్రాశస్త్యం గల స్త్రీగా తనను కొలుస్తారు. కౌసల్యకు మనస్సు పరిపరివిధాల పోతోంది.

పుత్ర కామేష్టి పూర్తయింది. ముప్పురు రాణులు తమ తమ అంత:పురాలలో వున్నారు. కౌసల్యామందిరం ముందు పరిచారికల కలకలం వినిపించింది. దీక్షావస్త్రాలతో వున్న ప్రభువు చేతిలో వున్న పాయసపాత్రతో సరాసరి పట్టపురాణి దేవతామందిరంలోనికి ప్రవేశిస్తున్నారు. మహారాజుకు బరాబరులు తీర్చి నిలబడ్డారు పరిచారికలు. పూజామందిరంలోంచి బయటకు వచ్చిన కౌసల్యాదేవి సర్వాలంకారభూషితయై నుదుట కుంకుమతిలకంతో విరాజిల్లుతోంది. పతిదేవుని చూడగానే పాదపద్మాలకు నమస్కరించి వినయంగా నిల్చుంది.

దశరథుడు : మహారాణీ! ఈ రోజు ఒక మహాద్భుతం జరిగింది. యజ్ఞగుండంలోంచి ఒక తేజోమూర్తి పాయసపాత్రతో ఆవిర్భవించాడు. పట్టపురాణివైన నీకు ఈ పాయసంలో అర్ధభాగం అందిస్తున్నాం.

పరమానంద భరితురాలై నేను ఆ పాయసాన్ని స్వీకరించాను. ధర్మబద్ధంగా తనకు మూడో భాగం లభించాలి. కానీ మహారాజు తనకు అర్ధభాగాన్ని ప్రసాదించాడు. హెచ్చుతగ్గులను గూర్తి తానెన్నడూ ఆలోచించనేలేదు. ఫలితంగా కౌసల్యానందవర్ధనుడు తనకు కలిగాడు. తన కన్నతండ్రి శ్రీరాముడు వసంతకాలంలో చైత్రమాస శుక్లపక్ష నవమితిథిన పునర్వసు నక్షత్రంనాడు

కర్కాటక లగ్నంలో జన్మించాడు.

పదకొండు రోజుల తర్వాత నామకరణం రోజు వశిష్ఠుల వారు చెప్పిన మాటలు నా చెవిలో ప్రతిధ్వనిస్తున్నాయి. మహా విష్ణువులో సగభాగాన్ని సమీకరించుకున్నాడు తన బిడ్డ. శ్రీరాముడని నామకరణం చేశారు వశిష్ఠులు. పీటలపై తన ప్రక్కనే కూర్చున్న దశరథుడు శ్రీరామచంద్రుని చూసి ఎంత మురిసిపోయాడో! అన్నీ శుభ లక్షణాలు కలిగి విశాలమైన నేత్రాలు, దొండపండువంటి పెదిమలు, శంఖంవంటి కంఠధ్వని కలిగిన ఆ బాలుని తన వొడిలో పడుకోబెట్టుకుని పుత్రవాత్సల్యంతో తానెంత సంతోషించిందో!

ఉపనయనాది సంస్కారాలు, విద్యాభ్యాసము యధా శాస్త్రోక్తంగా జరిగిపోయాయి. అన్న వెన్నంటి ఆ లక్ష్మణుడు తిరగడం తనకెంతో ఆనందదాయకం.

నా కన్నతండ్రి పెరిగి పెద్దవాడవుతున్నాడు.

పదహారేండ్లు ఇంకా నిండలేదు.

నా తండ్రికి వశిష్ఠుని వంటి గురువుకు తోడు విశ్వామిత్ర మహర్షి ప్రాపకం లభించడం అదృష్టం. ఆనాటి సభాకార్యక్రమాలు తాను చెలికత్తె ద్వారా విని సంతోషించింది. దశరథ మహారాజుల వారు సభకు బయలుదేరారు.

వందిజనుల స్తోత్ర పాఠములను వి
ప్రముడనగ రీవితో నడుగులిడుచు
మణిమయ మకుటభూషణులను సామంత
రాచ వినమ్ర శిరస్కుడగుచు
మంత్రాంగ బలమును చంద్రముగ నడుపు
సుమతి జనాభివాదముల గొనుచు
స్వస్తి వాచనముల ప్రవచించి వెన్వెంట
గురుడు వశిష్టుండు కొలువుదీర
భృత్యవర్గమ్ము నృపతి సంప్రీతుజేయ
గురులనుచితాసనమ్ములు గొన్న పిదప
పౌర జనుల జయ జయ ధ్వానములతో
రత్నపీఠి దశరథు డలంకరించె

ఆనాటి సభకు అనుకోకుండా విశ్వామిత్ర మహర్షి విచ్చేశాడు. శ్రీరాముణ్ణి తన యాగ సంరక్షణకు పంపమని కోరాడు. ప్రభువు చలించిపోయారు. 'రాముడు చిన్నవాడు. పంపలేను. నేనే స్వయంగా రక్షణకు వస్తానని' ప్రాధేయపడ్డాడు.

పదునారేడుల చిన్న పాపడకటా! పాపాత్ములౌ రాక్షసుల్

చదరంగమ్ముల నాడ కారడవి మీ సాహాయుడై నిల్చునే
కదనమ్మున నెరుంగనట్టి శిశువౌ గాధేయ! నే వచ్చి ని
ల్చెద రాకాసుల మట్టు బెట్టెదను మత్ సైన్యంబు వెన్వెంటరావ్!'

విశ్వామిత్రుడంగీకరించలేదు.

వశిష్ఠుని సూచనమేరకు శ్రీరాముని విశ్వామిత్రునివెంట పంపడానికి ప్రభువు అంగీకరించారు. రామునికి తోడు లక్ష్మణుని కూడా పంపమని వశిష్ఠుల వారి ఆదేశం.

వారిద్దరూ రాక్షస మూకలున్నచోట వెళ్తున్నారంటే నా మాతృ హృదయం తల్లడిల్లింది. అయినా వశిష్ఠులవారిపై గురుత్వంతో మనస్సు ఏ విధమైన కళంకాన్ని శంకించలేదు. రామలక్ష్మణులు బయలుదేరారు.

ముప్పురు రాణులు మురిపెంబు దీర ము
 ద్దాడి ప్రియసుతుల ననుపుచుండ
ముదముమీర జనులు ముద్దుల నొలికించు
 బాలకులను జూడ వచ్చుచుండ
గాధేయ వెన్వెంట కనుల పండువ జేయు
 రాఘవులగనుచు రమణులుండ
గారాబు సుతుల గాపాడవలయు సూ
 గాధేయ! యనుచు భూకాంతుడనుప
ఆర్యులెల్లరు నొసగిన యాశిషముల
 నీనుజులిరువురు నత్సాహజీవితులగు
మౌనిచంద్రుని వెన్వెంట మందగతిని
 పురిని యెడబాసి బాలకులరిగిరపుడు

కనుచూపు మేర దాటిన రామచంద్రుని, లక్ష్మణుని అలానే చూస్తూ నిలిచిపోయింది కౌసల్య. పరిపరివిధాలుగా పోతున్న మనస్సును చిక్కబట్టుకొంది.

ఆమె ప్రతి కదలికలోను, ప్రతిస్పందనలోను ఒక విధమైన మానవాంశ ఉంది. అది ఆమె శీలం వెనుక ఉన్న దైవాంశ ప్రాధాన్యం. తాను నోరు తెరిచి ప్రభువును ఏదీ అడగలేదు. వనాలకు నా బిడ్డను ఎందుకు పంపారని మహారాజును ప్రశ్నించలేదు.

తనకింకా గుర్తు. యాగసంరక్షణానంతరం తనరాముణ్ణి విశ్వామిత్రుడు మిథిలానగరానికి తీసుకెళ్లాడు. జనకమహారాజు విధించిన షరతును తన బిడ్డ అవలీలగా సాధించాడు. మహాశక్తివంతమైన శివధనస్సునెత్తడానికి విశ్వామిత్రుని అనుజ్ఞ కోరాడు. విశ్వామిత్రుడు తన శిఖముడిని అంగీకార సూచకంగా కదిలించాడు. ఎంత మధుర సన్నివేశం.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Antaranga+Tarangam**

* * *